ప్రజాశక్తి

సోమవారం 6 నవంబర్ 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పేద విద్యార్థులకు ఉచిత మిథ్య!

- విద్యా హక్కు చట్టం అమల్లో ప్రైవేటు యాజమాన్యాల నిర్లక్ష్యం
- ఉచిత సీట్లు ఇవ్వడానికి వెనకడుగు
- ఎన్‌టిఆర్ జిల్లాలో 444 మందికే ప్రవేశం
- పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాలబాలికల పట్ల ప్రైవేటు యాజమాన్యాలు బాధ్యతను విస్మరిస్తున్నాయి. ఒకటో తరగతిలో అడ్మిషన్లు కల్పించి ఇతర విద్యార్థులతో సమానంగా విద్యాబుద్ధులు నేర్పించడంలో వెనుకడుగు వేస్తున్నాయి. ఎంతో మంది పేద విద్యార్థులు చదువు'కొనలేక'.. ఎక్కడ ఉచితమంటే అక్కడకు పరుగులు తీస్తారు. 2009లో అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఏడాదీ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించి సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రవేశాలు కల్పించాలి. పేదలకు ప్రైవేటు, కార్పొరేటు స్కూల్స్‌లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పూర్తి ఉచితంగా విద్యాబోధన అందించాలి. చట్టమైతే చేశారుగానీ అమల్లో అలసత్వం తాండవిస్తోంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లా అధికారులు దృష్టి సారించారు. అయినా ఈ దఫా కూడా అధికారుల్లో చిత్త శుద్ధి కొరవడిందని, దీంతో నామమాత్రంగానే ప్రవేశాలు కల్పించారని పలువురు ఆక్షేపిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరంలో కేవలం 444 మందికి మాత్రమే ప్రవేశాలు కల్పించడమే దీనికి నిదర్శనం.

విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు కేటాయించాలి. అంటే అనాథలు, వికలాంగులు, హెఐవి ప్రభావిత పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, వార్షిక ఆదాయం (పట్టణ ప్రాంతాల్లో రూ.1.44లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.20లక్షలలోపు) తక్కువ ఉన్న బిసిలు, మైనారిటీలు, ఓసి వర్గాలకు 6 శాతం చొప్పున సీట్లు కేటాయించాలి. వీరికి ప్రవేశాలు కల్పించినందుకు యాజమాన్యాలకు ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థికి అర్బన్ ప్రాంతాల్లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 6,500, షెడ్యూల్ట్ ఏరియాల్లో రూ. 5,100 చొప్పున ఫీజుల కింద ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే ఎన్‌టిఆర్ జిల్లాలో ఈ చట్టం అమలుపై అధికారుల చిత్తశుద్ధి కొరవడింది. ఎనిమిది మండలాల్లో పది మంది కంటే తక్కువ ప్రవేశాలు కల్పించగా, పెనుగంచిప్రోలు మండలంలో ఒక్కరికి కూడా ప్రవేశం కల్పించలేకపోయారు. ఈ మండలం పరిధిలో తొమ్మిది ప్రైవేటు పాఠశాలలు ఉండగా వీటిల్లో ఈ ఏడాది 2,484 మందికి జనరల్ అడ్మిషన్లు ఇచ్చారు. జిల్లాలోని మరో ఐదు మండలాల్లో పదికిపైగా ప్రవేశాలు కల్పించారు. విజయవాడ అర్బన్‌లో అధికంగా 207 మందికి అవకాశం కల్పించారు. మండలాల వారీగా ఆర్‌టిఇ చట్టం 12(1)సి ప్రకారం ప్రవేశాలు ఒక సారి పరిశీలిస్తే ఏకొండూరు మండంలో 7 మందికి, చందర్లపాడులో 3, జికొండూరులో 57, గంపలగూడెంలో 9, ఇబ్రహీంపట్నంలో 33, జగ్గయ్యపేటలో 11, కంచికచర్లలో 29, మైలవరంలో 37, నందిగామలో 9, రెడ్డిగూడెంలో 11, తిరువూరులో 5, వత్సవాయిలో 4, వీరులపాడులో 3, విజయవాడ రూరల్‌లో 13, విజయవాడ అర్బన్‌లో 207, విస్సన్నపేటలో 6 మందికి చొప్పున ప్రవేశాలు కల్పించారు. అయితే ఈ అంశంపై అధికారులు పెద్దగా శ్రద్ధ చూపలేదని, ప్రైవేటు యాజమాన్యాలతో లాలూచీ పడటంతో అరకొరా చేపట్టి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇవే ప్రైవేటు పాఠశాలల్లో జనరల్ అడ్మిషన్లు పెద్ద స్థాయిలో జరగడమే దీనికి నిదర్శనమని ఆక్షేపణలు ఉన్నాయి. జిల్లాలో 517 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ఈ ఏడాది అన్ని తరగతులు కలిపి 1.97లక్షల మందికి జనరల్ ప్రవేశాలు కల్పించారు.



గన్నవరం విమానాశ్రయంలో ఇంగ్లాండ్ జట్టుకు స్వాగతం పలుకుతున్న టోర్నమెంట్ ఇన్‌ఛార్జిలు

విజయవాడ చేరుకున్న ఇంగ్లాండ్ జట్టు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: బిసిసిఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) పర్యవేక్షణలో ఈ నెల 13 నుంచి 27వ తేదీ వరకు అండర్-19 పురుషుల అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఇంగ్లాండ్ జట్టు ఆదివారం విజయవాడకు చేరుకుంది. గన్నవరం విమానాశ్రయంలో టోర్నమెంట్ ఇంచార్జిలు బాపూజీ, వెంకటాద్రిరెడ్డి తదితరులు ఇంగ్లాండ్ జట్టుకు ఘన స్వాగతం పలికారు. మూలపాడులోని డీవీఆర్, సీపీ గ్రౌండ్లలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఇండియా-ఎ, ఇండియా-బి జట్లు పాల్గొనున్నాయి.

'ప్రజా రక్షణభేరి' జయప్రదం కోరుతూ ప్రచారం

... వార్తలు లోపలి పేజీల్లో



ప్రజా రక్షణభేరి విజయవంతం కోరుతూ విజయవాడ కృష్ణలంక 22వ డివిజన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు, తదితరులు



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

టిడిపి హయాంలో విజయవాడ అభివృద్ధి శూన్యం

వైఎస్ఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-భవానీపురం

టిడిపి హయాంలో విజయవాడ అభివృద్ధి శూన్యమని విద్యుత్, ఫారెస్టు, భుగర్భ వనరుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గం భవానీపురం స్వాతి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 15 అడుగుల వైఎస్ఆర్ కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), పారిపోయిన జలీల్ ఖాన్, దద్దమ్మ దేవినేని ఉమా ఉండి (మిగతా 6లో)

9 నుంచి ధాన్యం కొనుగోళ్లు

- కామన్ రకం క్వింటాకు రూ.2,183, ఎ గ్రేడ్‌కు రూ. 2,203 చెల్లింపు
- రవాణా వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి
- పౌర సరఫరాల సంస్థ కృష్ణాజిల్లా మేనేజర్ శ్రీధర్



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె)ల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకున్నామని పౌర సరఫరాల సంస్థ కృష్ణాజిల్లా మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఐదు నాణ్యతా ప్రమాణాలకులో బడి ఉన్న ధాన్యం రైతులు నుండి ఆర్బీకెల ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. మండలాలవారీగా ఆర్బీకెలకు రైస్ మిల్లుల మ్యాపింగ్ పూర్తయిందని చెప్పారు. సేకరణకు అవరమైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామని వివరించారు. ధాన్యం రవాణా యంత్రాలకు జిపిఎస్ పరికరాలు తప్పనిసరన్నారు. కృష్ణాజిల్లాలో 2023-24 సీజన్ ధాన్యం సేకరణ ప్రణాళిక గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రీధర్ వివరించారు.



ప్రశ్న: ధాన్యం సేకరణ ఎప్పటి నుంచి ప్రారంభిస్తున్నారు?

పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, మొవ్వ, గుడివాడ, పెదపారుపూడి, పెడన, గూడూరు తదితర మండలాల్లో చాలా చోట్ల వరి పంట కోతకు వచ్చింది. ఈ ప్రాంతాల్లో హార్వెస్టింగ్ (యంత్రాలు ద్వారా నూర్పిడి) ఎక్కువగా జరుగుతుంది. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ఆర్బీకెల ద్వారా కనీస మద్దతు ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: ఎన్ని ఎకరాలకు ఈ క్రాప్ జరిగింది? ఎన్ని టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తారు?

రైతు పండించిన ధాన్యం ఆర్బీకెల ద్వారా మాత్రమే అమ్మాలనే నిబంధన ఏమీ లేదు. కనీస మద్దతు ధర, అంతకన్నా ఎక్కువ ధర ఎక్కడ లభిస్తే అక్కడ అమ్ముకోవచ్చు. రైతులు బయట మార్కెట్‌లో విక్రయించిన ధాన్యం వివరాలను ఆర్బీకెలకు అందించాలి. 3 లక్షల 49 వేల ఎకరాల్లో వరి పంట ఈక్రాప్, ఈకెవైసి జరిగింది. బిపిటిలు మినహా ఇతర రకాల ధాన్యం ఉత్పత్తులు 8 లక్షల 75 వేల టన్నులు వస్తుందని అంచనా. ఒక్కో ఎకరాకు 30 క్వింటాళ్ళు చొప్పున రైతుల నుంచి (మిగతా 6లో)

వైఎస్ఆర్ బీమా మంజూరు పత్రం అందజేత

ప్రజాశక్తి - నందిగామ : పరిటాల గ్రామానికి చెందిన ఉప్పులూరి పూర్ణచంద్రరావు రోడ్డు ప్రమాదంలో మతి చెందడంతో వైయస్ఆర్ బీమా మంజూరు చేశారు. నందిగామలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పరిటాల గ్రామంలో చెందిన ఉప్పులూరి పూర్ణచంద్రరావు కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మతి చెందడంతో వైయస్సార్ బీమా కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. మృతుని భార్య అనురాధకు ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల సవరణపై అవగాహన

ప్రజాశక్తి - నందిగామ : తెలుగుదేశం పార్టీ, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ నాని ఆదేశాల ప్రకారం నందిగామ నియోజకవర్గ చందాపురం గ్రామంలో పోలింగ్ బూత్ 69లో ఆదివారం ఓట్ల నమోదుపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. గడపగడపకు భవిష్యత్తు గ్యారంటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా, ఓటర్ నమోదు, సవరణలు చేసుకోవాలని నందిగామ నియోజకవర్గ 69వ బూత్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది, ఎక్కిరాల హనుమంతరావు కోరారు.

కల్చరల్ ఫెస్ట్‌ల ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి - నందిగామ : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేలా కల్చరల్ ఫెస్ట్‌లు ఏర్పాటు చేయడం హర్షణీయమని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం రాత్రి నందిగామ శ్రీ గౌతమ హైస్కూల్ కల్చరల్ ఫెస్ట్ వేడుకలు నిర్వహించారు. ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థులను విజ్ఞానశాస్త్ర పరిశోధనల వైపు దృష్టి సారించేలా కల్చరల్ ఫెస్ట్‌లు నిర్వహించడం వలన విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరగడంతో పాటు విద్యాప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను చిన్నప్పటినుంచే ఆలోచన శక్తి పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఎంఎల్ఎను గౌతమ హైస్కూల్ యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరికొండ రవీంద్రబాబు, కరస్పాండెంట్ సరికొండ అఖిల్, పలువురు ఉపాధ్యాయులు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఎండిన పొలాన్ని చూస్తున్న నాయకులు, రైతులు

రెడ్డిగూడెంను కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకతి వైపరీత్యం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వరి పంటను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 16 మండలాల్లో కూడా వరి పంట దెబ్బతిందనీ, పెట్టుబడి పెట్టిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారనీ ప్రభుత్వం మాత్రం రెండు మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం సరైంది కాదని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, రెడ్డిగూడెం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, చాట్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ రుణాలపై కళాజాతా

ప్రజాశక్తి మైలవరం : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో మైలవరం బ్రాంచ్ చంద్రగూడెం పిఏసిఎస్ వద్ద ఆదివారం డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాల గురించి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం బ్రాంచ్ మేనేజర్ శివ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతా తెరవాలన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు నగదు రహిత లావాదేవీలు, డెబిట్ కార్డు వాడకం వల్ల కలిగే లాభాలు గురించి కళాజాత బృందం వారు వివరించారు.

ప్రజా రక్షణభేరి విజయవంతం కోరుతూ ప్రచారాలు


ఇబ్రహీంపట్నంలో


తిరువూరులో


రాణిగారితోట 17,18 డివిజన్లలో


సిఐటియు తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో


జగ్గయ్యపేటలో

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 15వ తేదీన సింగ్‌నగర్ ఎంబి స్టేడియం జరిగే సిపిఎం "ప్రజారక్షణ భేరి" బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రచార పాదయాత్ర కార్యక్రమం రాణిగారితోట 17,18 డివిజన్లలో ఆదివారం జరిగింది. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీసభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ...ఈ నెల 15న విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే సభను విజయవతం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలిరావాలని పిలుపునిచ్చారు. మూడోసారి మోడీ ప్రధాన మంత్రి కావాలని పవన్ కళ్యాణ్ కోరటం శోచనీయమని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తమ్మిన చంద్రశేఖర్ , బి చిన్నారావు, డి వరప్రసాద్, కందుకూరి వెంకటేశ్వరావు, పాల్గొన్నారు. ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి పిలుపునిచ్చారు. క్రైస్తవుల పై దాడులను ఖండించండి-మతోన్మాద బిజెపిని గద్దె దించండని పిలుపునిస్తూ సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాయికాపురం, సుందరయ్య నగర్, ఉడాకాలనీ 62,63వ డివిజన్‌లోని చర్చిల వద్ద ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె దుర్గారావు, నాయకులు యన్.నాగేశ్వరరావు, బొంగు రాంబాబు,పి.సాంబిరెడ్డి, పాల్గొన్నారు.**విజయవాడ అర్బన్ :** ఈనెల 15న జరుగనున్న ప్రజా రక్షణ బేరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ బెంజిసర్కిల్ వద్ద గల భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి బి.బెనర్జీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు వి.బి.రాజు, నాయకులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ నాయకులు, జగ్గయ్యపేట పట్టణ శాఖ కార్యదర్శి, న్యాయవాది దాసరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్, ఆర్టీసీ డిపో, కమల సెంటర్, బస్టాండ్, మున్సిపల్ కూడలి, బస్టాండ్ రోడ్డు, పాతగడ్డ ప్రాంతాల్లో ఆదివారం ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలను కోరుతూ గోడ ప్రతులతో, కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రజా రక్షణ భేరి కార్యక్రమానికి అఖిలభారత సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రాంప్రసాద్, రావెళ్ల శేషు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివి.కృష్ణ మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశం మొత్తం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి టౌన్ కార్యదర్శి ఎం.మహేష్, నాయకులు ఎ.విఠల్ రావు, వి.మురళీమోహన్, ఇర్లా కొండలరావు ఎస్కె భాషా, కె.నారాయణ, ఎన్ బాబ్జి, కవి తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి :** మండల కేంద్రమైన వత్సవాయిలో సిపిఎం కార్యాలయంలో ప్రజారక్షణభేరీ పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సిహెచ్.హనుమంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, మండల కమిటీ సభ్యులు కె.కొండయ్య పాల్గొన్నారు. **నేడు బైక్ ర్యాలీనీ** ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ 6న వత్సవాయి మండలంలో సిపిఎం మండల శాఖ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు కోరారు. వత్సవాయిలో ప్రారంభమై ఈ బైక్ ర్యాలీ వేములనర్వ, ఖమ్మంపాడు, తాళ్లూరు, మాచినేని పాలెం, కాకరవాయి, పాత వేమవరం, కొత్త వేమవరం, డబ్బాకుపల్లి, పెం ట్యాల వారి గూడెం, పోలంపల్లి గ్రామాలకు వరకు కొనసాగుతుందని తెలిపారు. **వీరులపాడు :** దొడ్డ దేవరపాడు గ్రామంలో బహిరంగ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి మండల కమిటీ సభ్యుడు పల్లె కంటి బాబూరావు హరిబండ్ల ఆనందరావు అరిగల గోపయ్య పత్తిపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని గోడపత్రికలు అంటించారు. సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి ప్రారంభించిన కార్యక్రమంలో పల్లె కంటే బాబు ఆనందరావు రాజేష్ లాల్ అహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. **తిరువూరు :** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా రక్షణ వాల్ పోస్టర్లను అయన పార్టీ నాయకుల కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో వైసీపీ, టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని రాష్ట్ర సాధన లక్ష్యం

పి.వి.ఆంజనేయులు


జి కొండూరులో



రెడ్డిగూడెంలో

జి కొండూరు : ఈ నెల 15న విజయవాడ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సిపిఎం ఆధ్వర్యంలో జరగబోయే ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ జి.కొండూరు మండలం లో గల అన్ని గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రజలను నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం విడదీసి పాలిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 15 వ తేదీన విజయవాడ లో జరిగే బహిరంగ సభలో సీతారాం ఏచూరి మరియు వక్తలు పాల్గొంటారని కనుక ఈ సభకు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జి కొండూరు మండల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే బాలకష్ణ,మైలవరం మండల నాయకులు చాట్ల సుధాకర్, ఇరుగుదనుల శ్రీను కోటేశ్వరరావు సీనియర్ నాయకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** 2రెడ్డిగూడెం మండలంలో గల అన్ని గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు అమలు చేయకపోయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష పార్టీగా ఉన్న టిడిపి, మార్పుకోసం అంటూ వచ్చిన జనసేన పార్టీలు బిజెపి కి లొంగిపోవడంతో రాష్ట్రం అధోగతి పాలైపోతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సిపిఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, నాయకులు చాట్ల సుధాకర్ ఎం మాధవరెడ్డి, వెంకటరెడ్డి ఇస్సాకు ఏ కొండూరు మండల పార్టీ నాయకులు జట్టి వెంకటేశ్వరరావు ఆనందరావు అమ్మిరెడ్డి పాల్గొన్నారు.


వత్సవాయిలో


వీరులపాడులో


62, 63వ డివిజన్‌లో

అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో నిధుల ఖర్చు చేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలో మండల పరిషత్ నిధులు, ఎం.జీ.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులు వెరసి మొత్తం రూ.26 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్క అంతర్గత రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివద్ధి చేస్తామని చెప్పారు. మొగులూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణాలకు రూ.10 లక్షలు, ఎస్టీ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణాలకు రూ.16 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు

డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 10వ వార్డు యాదవ బజార్‌లో నిర్మిస్తున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఈ వీధిలో డ్రైనేజ్ సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలియజేయడంతో మున్సిపల్ సాధారణ నిధుల నుండి డ్రైన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, వార్డు వైసిపి నాయకులు షేక్ సైదా, కొట్టకూటి సైదులు, అప్పారావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి : సిపిఎం


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం : దేశంలో పేద వర్గాల బాగు కోసం సమరశీల ఉద్యమాలను మరింత తీవ్రతరం చేయాల్సి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. ఈనెల తొమ్మిదవ తేదీన గన్నవరం నియోజకవర్గంలో జరగనున్న రాష్ట్రస్థాయి జయభేరి యాత్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గన్నవరం లోని పార్టీ కార్యాల యంలో మిరప నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జరిగిన విస్తత సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీఅధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నర సంవత్సరాలుగా పేదలకు, రైతులకు, కార్మికులకు ఉపయోగపడే చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. పేద వర్గాల హక్కులను కాలరాస్తూ, మరింత పేదరికంలోకి నెట్టేశారనీ, ఈ వర్గాల హక్కుల కోసం మనం పోరాటా లకు సమాయత్తం కావాలన్నారు. ఈ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో పేదరికం, నిరుద్యోగం తారాస్థాయికి చేరాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వాలు బిజెపికి మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల పట్టని దీపాల కుల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈనెల తొమ్మిదవ తేదీన ఉదయం హనుమాన్ జంక్షన్ లో ప్రారంభమైన బైక్ ర్యాలీ బాపులపాడు మండలం ఉంగుటూరు మండలం మీదుగా గన్నవరం చేరుతుందన్నారు. 200 బైకులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే అనేక దఫాలుగా ఏపీలో అన్ని జిల్లాల్లో భూ పోరాటాలు నిర్వహిస్తూ పేదలకు ఇళ్ల స్థలాలు,సాగు - భూముల కోసం భూములను గుర్తించి పేదలకు అందజేస్తున్నామన్నారు. ఒక్క నవరత్నాలతోనే పేదల బతుకులు మారవని, ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని అనేకమార్లు ఉద్యమాలు చేసి డిమాండ్ చేసినా, రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. భవిష్యత్తులో ఇళ్ల స్థలాలు, పక్కా గహాలు, సాగు భూముల అంశంపై పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కాబోతున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, ఉదయ భాస్కరరావు, సూరగని సాంబ శివరావు, పటాన్ సర్దార్, ఉడత రామకష్ణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : త్వరలో జరిగే మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ ఎజెండాలో పట్టాభి స్మారక భవనం విషయంపై తీర్మానం చేయాలని పట్టాభి స్మారక భవనం కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్వతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన కమిటీ సభ్యులు పి. వి. ఫణి కుమార్, మామిడి మురళీకష్ణ, వడ్లమన్నాటి మారుతి దివాకర్, జమ్మలమడక సేతురామయ్య, విఎస్-ఎస్ ఆర్ శర్మ, మోపర్తి సుబ్రమణ్యం తదితరులు యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుని, చరిత్ర కలిగిన కష్ణాజిల్లా ప్రధాన కేంద్రమైన మచిలీపట్నంలో పట్టాభి స్మారక భవనం నిర్మాణమునకు త్వరలో జరిగే మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ ఎజెండాలో పెట్టి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మచిలీపట్నంలో స్మారక భవనానికి ప్రజలకు ఉపయోగపడే విధంగా స్థలం కేటాయించారని, కానీ రెండు సంవత్సరాల నుండి మచిలీపట్నం నగరపాలక సంస్థ అనుమతులు ఇవ్వకపోవడం దురదష్టకరం అన్నారు. ఎంపీ బాలసౌరి పలుమార్లు ఈ విషయంపై మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌ను నిలదీసిన స్పందన లేకపోవడం బాధాకరం అన్నారు. వెంటనే మచిలీపట్నం నగరపాలక సంస్థ అధికారులు సదరు అంశాన్ని ఎజెండాలో పెట్టి అనుమతులు ఇప్పించి పట్టాభి స్మారక భవనం పనులు ప్రారంభం అయ్యేటట్లు చూడాలని డిమాండ్ చేశారు.

సుందరయ్య, అల్లూరి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

పెనమలూరు : వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ సెంటర్లో బందరు కాలువ కట్టమీద మహాత్మాగాంధీ, పుచ్చలపల్లి సుందరయ్య, అల్లూరి సీతారామరాజు విగ్రహాలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈసం దర్భంగా పెనమలూరు మండలం సిపిఎంకార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, దివంగత మాజీముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రావ్, జ్యోతిరావు పూలే, డాక్టర్ అబ్దుల్ కలాంవిగ్రహాలను ఏర్పాటు చేశారని, వీరితోపాటు మహాత్మాగాంధీ, పుచ్చలపల్లి సుందరయ్య, అల్లూరి సీతారామరాజు విగ్రహాలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండలం సిఐటియు ఉపాధ్యక్షులు. ఎస్కే మస్తాన్ వలి,పెనమలూరు మండలం ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి. పుసులూరి పాత లక్ష్మి, తాడిగడప మున్సిపాలిటీ సిపిఎం పార్టీ నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ యువజన సంఘం పెనమలూరు మండలం కార్యదర్శి పుసులూరి లక్ష్మీనారాయణ, సిఐటియు పెనమలూరు మండలం నాయకులు మద్దినేని సాంబశివరావు, తాడిగడప మున్సిపాలిటీ సిపిఎం పార్టీ నాయకులు ఎస్ కే బాబు, పెనమలూరు మండలం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గుంజి నరస య్య, ఐద్వా మహిళా సంఘం పెనమలూరు మం డలం నాయకురాలు విసం రమణమ్మ, తాడిగడప మున్సి పాలిటీ సిపిఎం నాయకులు దిసరి సింహాచలం పాల్గొన్నారు.

కొండాలమ్మ దేవస్థానానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సుమారు 23వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, ఏర్పాట్లు పరిశీలించినట్లు తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాబోయే కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రతి శనివారం అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి పంచారామాలకు ప్రత్యేక బస్ సర్వీసులు నడపనున్నట్లు ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రసిద్ధ క్షేత్రాలైనటువంటి అహోబిలం, మహానంది, బ్రహ్మంగారిమఠం, యాగంటి మంత్రాలయం, అలంపూర్, శ్రీశైలం, త్రిపురాంతకం కలుపుకొని స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ఈ కార్తీకమాసంలో పౌర్ణమికి యధావిధిగా అవనిగడ్డ నుండి అరుణాచలంకు వివిధ పుణ్యక్షేత్రాలు కలుపుకొని ప్రత్యేక బస్సులు నడపనున్నందున ఈ ప్రాంత భక్తులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డిపో మేనేజర్ కోరారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక నృత్యాలు

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక వి. ఎస్. సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో జరుగుతున్న మౌంట్ పోర్ట్ విద్యా సంస్థల అంతరాష్ట్ర సాహిత్య మరియు సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న పోటీలో భాగంగా ఆదివారం ఇంగ్లీషు, తెలుగు మరియు హిందీ ఎక్స్ టెంపర్ , తెలుగు , ఇంగ్లీషు పోస్టర్ మేకింగ్ సాహిత్య విభాగంలో , జానపదం , వెస్ట్రన్ శైలిలో సోలో డాన్సు పోటీలతో పాటు రంగోలి, గ్రూపు సింగింగ్ పోటీలు నిర్వహించారు. ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన 27 పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన గ్రూపు సింగింగ్ , సోలో డాన్స్ పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రసవత్తరంగా జరిగిన ఈ పోటీలో 22 గ్రూపులుపాల్గొన్ని ప్రతిభను చాటారు. ముఖ్యంగా పర్యావరణం - పరిరక్షణ ప్రధాన అంశంగా తీసుకుని విద్యార్థులు సందేశాత్మక బందగానం పేక్షకులను ఎంతగానో అలరించింది.

ఘనంగా సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక శ్రీరాంపురంలోని వెలమ సంక్షేమ సంఘ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఆదివారం డాక్టర్ గొర్జి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ అంకేంరెడ్డి నారాయణమూర్తి గోర్జితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు గోర్జిని దుశాల్వతో, పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘ నాయకలు తెంటు సత్య, తిరుపతి నాయుడు, ముకల అప్పారావు, గులిపల్లి ప్రభాకరరావు, పూడి సుధాకర్, గంటా చంద్రశేఖర్, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీ పట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు.ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ పి. రాజా బాబు పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ కిషోర్‌బాబు

ప్రజాశక్తి-పమిడిముక్కల : మంచి ప్రవర్తన కలిగి గ్రామాలలో మంచిని పెంచాలని పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు అన్నారు. ఆదివారం పమిడిముక్కల పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడును వదిలివేయాలని, మంచిది పెంచాలని అన్నారు. లంకపల్లి, మంటాడ, కపిలేశ్వరపురం గ్రామాలలో పోలీసు నిఘా ఎప్పుడూ ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన


రేషన్ సరుకుల వాహనాన్ని తనిఖీ చేస్తున్న పార్వతిదేవి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వం రూ. 40 రూపాయలకు కొనుగోలు చేసి తెల్ల రేషన్ కార్డుదారులకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని వి పార్వతి దేవి సూచించారు. ఆదివారం అవనిగడ్డ నాలుగో వార్డులో ఇంటి వద్దకే నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె తెల్ల రేషన్ కార్డుదారుల కు రేషన్ సరఫరా సక్రమంగా జరుగుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వాహనం ద్వారా సరఫరా జరుగుతున్న విధానములోని లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. కాగా గత నెలలో సర్వర్ సరిగా పనిచేయకపోవడం వల్ల రేషన్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ నెలలో ఇంతవరకు ఎక్కడా సర్వ సమస్య రాలేదని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆ శాఖకు సంబంధించిన సిబ్బంది రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

చేపల వేట నిషేధ భృతి పెంచాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : సముద్రంలో చేపల వేట నిషేధపు జీవన భతి 20 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు నాగిడి తాతారావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్స్యకారుల చైతన్య సదస్సులో భాగంగా నాగాయలంక మండల పరిధిలోని స్వర్ణ గొంది దీన దయ్యాల పురం కర్ర చివర గ్రామాలలో చైతన్య సదస్సులు నిర్వహించారు. వైయస్సార్ భరోసా కింద వివిధ వత్తుల వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం పదివేలు ఇస్తుందని, అయితే వీరు ఎవరు వారి వత్తులు మానుకోవడం లేదన్నారు మత్స్యకారులు మాత్రమే రెండు మాసాలు వేట నిషేధం విధిస్తుండటంతో వీరి కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి అన్నారు. నిత్యవసర సరుకులు ధరలు పెరిగిన నేపథ్యంలో వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ పదివేల రూపాయలు ఏమాత్రం సరిపోవని, ఈ నేపథ్యంలో మత్స్యకారులకు వేట నిషేధం వలన ఉపాధి కోల్పోయి మత్స్యకారులకు కూడా ఈ మతిని వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాయుడు రామయ్య, తమ్ము తాతారావు, దమ్ము ధర్మరాజు, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, దమ్ము గోవిందరాజులు కుక్కిలిగడ్డ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


భృతి పెంచాలని డిమాండ్ చేస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు


మాట్లాడుతున్న జమలపూర్ణమ్మ

విజయవాడ : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ పలు సూచనలు చేశారు. ఈ మేరకు ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 14 నుండి 20 వరకు జరిగే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, వారోత్సవాల్లో ప్రజాప్రతినిధులను తప్పక ఆహ్వానించాలని తెలిపారు. ప్రొటోకాల్ తప్పక పాటించాలని, సక్రమంగా నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యం.వి.డి.టి నగేష్ సూచనలు, సలహాలు, ఆదేశాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్నీ గ్రంథాలయాల సిబ్బంది, ఠాగూర్ గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు వైసిపి దందాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్: శాసనసభ్యుడి అండదండలతో అక్రమ దందాలతో చెలరేగిపోతున్న వైసిపి కార్పొరేటర్లకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టిడిపి పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్ విమర్శించారు. ఆదివారం పశ్చిమ టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ భవానీపురం ఏరియాలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు కోసం, అన్ని నియోజకవర్గాల నుండి వ్యాపారస్తులను భయపెట్టించి సుమారు రూ. 30 లక్షల వరకు భారీగా వసూలు చేశారన్నారు. అనుమతి లేకుండా వైఎస్ విగ్రహాన్ని ఏవిధంగా ఏర్పాటు చేసి ప్రారంభిస్తారని బేగ్ ప్రశ్నించారు.

జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ విమర్శలు


మాట్లాడుతున్న పోతిన మహేష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శివాలయం సెంటర్ పేరు మారుస్తూ వైఎస్ఆర్ సర్కిల్‌గా నామకరణం చేయడం దారుణమని, దేవుడితో చెలగాటమాడితే సర్వనాశనమై పోతారని జనసేన నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ ఘాటుగా విమర్శించారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవానీపురంలో తాను ప్రెస్‌మీట్ పెట్టకుండా పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. భవానీపురం శివాలయం సెంటర్లో అక్రమంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తే మీరు దానికి ఎలా అనుమతులిచ్చారని ప్రశ్నించారు. చందాలు వసూలు చేసి రూ.40 – 50 లక్షలు కొట్టేయడానికే అక్కడ వైఎస్ విగ్రహం పెట్టారని విమర్శించారు. సమావేశంలో తిరపతి అనూష, హనుమాన్, పాల్గొన్నారు.

పశ్చిమలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాలతో పశ్చిమ నియోజకవర్గ నాయకులు ఎంఎస్.బేగ్ సారధ్యంలో పశ్చిమ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ హబీబ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, పశ్చిమ నియోజకవర్గం మైనారిటీల బలోపేతానికి ఆదివారం సమావేశం నిర్వహించారు.

అన్నప్రసాదం వితరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ హరిహర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పలువురు అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ ఆదివారం నిర్వహించారు. శ్రీ హరిహర అయ్యప్ప సేవా సమితి నిర్వాహకులు, పశ్చిమ నియోజకవర్గం వాగు సెంటర్‌లో గల ఆంజనేయస్వామి దేవాలయ పురోహితులు విన్నకోట శ్రీనివాసరావు నేతృత్వంలో అయ్యప్ప మాలాధారణ చేసిన సుమారు 500 మంది అయ్యప్ప స్వాము లకు ఆంజనేయ స్వామి దేవాల యం ప్రాంగ ణంలో శాస్త్రోక్తంగా పూజాది కాలు నిర్వహించి, స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా విన్నకోట శ్రీనివాసరావు మాట్లాడారు.


అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ చేస్తున్న విన్నకోట శ్రీనివాసరావు

విద్యుత్ లైన్లు ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని కాళేశ్వరరావు మార్కెట్ పాత శివాలయం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ అడ్డదిడ్డంగా ఉన్న కరెంటు తీగలను తొలగించి సీపీడీసీఎల్ ప్రయోగాత్మకంగా ఎంసీబీ బాక్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. దేశంలోనే తొలిసారి ఈ తరహాలో ఎంసీబీలు ఏర్పాటు చేశామని, ఇలాంటివి పట్టణాల్లో చాలా ఉపయోగమని అన్నారు. ఇకపై వన్‌టౌన్‌లో అడ్డదిడ్డంగా ఉండే కరెంట్ తీగల నుంచి వ్యాపారులకు, ప్రజలకు సమస్యలుండవని, ఇలాంటివి మరిన్ని చోట్ల ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త దేవినేని అవినాష్, స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


నూతన విద్యుత్‌లైన్లను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మానవ వనరుల అభివృద్ధిలో హెచ్‌ఆర్ పాత్రే కీలకం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మారుతున్న కాలం, పరిస్థితులకు అనుగుణంగా మానవ వనరుల అభివద్ధిలో హెచ్‌ఆర్ ల పాత్రే కీలకంగా మారిందని డెల్లోయిట్ భాగస్వామి ఎస్‌వి.నాథన్ తెలిపారు. సంస్థలు, యాజమాన్యానికి ఉద్యోగులకు మధ్య సంక్లిష్ట వ్యవహారాలు తలెత్తిన సందర్భంలో వారి చొరవతోనే పరిష్కారం మార్గం సులభతరం అవుతుందని అభిప్రాయపడ్డారు. అమరావతి హెచ్‌ఆర్ చాప్టర్ 7వ వార్షికోత్సవాన్ని నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమస్త పురోభివద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్న హెచ్‌ఆర్‌లు అందివస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం విరివిగా వినియోగించ బడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెచ్‌ఆర్‌లకు ఇంకో ఆయుధంగా సమకూరిందని తెలిపారు. మరో విశిష్ట అతిథి ప్రఖ్యాత సినీ, బుల్లితెర నటుడు ప్రదీప్ మాట్లాడుతూ ఎక్కడైనా ఉద్యోగులకు యాజమాన్యానికి సంధానకర్తగా వ్యవహరించే హెచ్‌ఆర్‌ల పాత్ర ఎంతో విశిష్టమైనదన్నారు. ఈ వార్షిక సమావేశంలో పారిశ్రామిక, వ్యాపార సంస్థల్లో మానవ వనరుల అభివద్ధి, మానవ సంబంధాల పటిష్టత, సంస్థల పురోభివద్ధి, మానవ వనరుల కీలకపాత్ర వంటి తదితర అంశాలను ప్రముఖంగా చర్చించినట్లు అమరావతి హెచ్‌ఆర్ చాప్టర్ ఫౌండర్, అధ్యక్షుడు రవితేజ తల్లం తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుని టెక్నాలజీలో సాంకేతికతను మానవ మనుగడలో అనూహ్యమైన రూపాంత రాలను పరిణమిస్తున్న సబ్జెక్టుని తమ అజెండాగా ఎంచుకుని తోటి హెచ్‌ఆర్ ప్రొఫెషనల్ యొక్క తాజా విజ్ఞాన అభివద్ధికి ఉపయోగపడేలా ఈ సమావేశంలో నిర్ణయించుకున్నారు. ఈ వార్షికోత్సవంలో రాష్ట్రం, దేశం నలుమూలల నుండి సుమారు 300కు పైగా హెచ్‌ఆర్లు పాల్గొన్నారు.




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ దర్శనార్థం ఆదివారం యాత్రికులు పోటెత్తారు. ఈ సందర్భంగా దేవస్థానంలో లోకాకళ్యాణార్థం ఆలయ అర్చకులు నిర్వహించిన సూర్యోపాసన సేవలో యాత్రికులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్ రామరావు, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి దర్శనార్థం విశేషంగా విచ్చేసిన భక్తుల రద్దీ దష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లును పర్యవేక్షించారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతికళ్యాణం, ఇతర సేవల యందు విశేషంగా భక్తులు పాల్గొని శ్రీ అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.


దర్శనం కోసం క్యూ లైనులో వేచివున్న భక్తులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు


టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవ స్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం ఆదివారం ఏపి, తెలంగాణా ఇన్‌కమ్‌టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, బందం శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికా రులు ఆలయ మర్యా దలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనం తరం వీరికి వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.


మిథాలి మధుస్మితకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం భారతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ ఆదివారం విచ్చేశారు. శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన నైనా జైస్వాల్‌కు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

దళితులపై దాడులకు ఖండన

ప్రజాశక్తి - నందిగామ : దళితులపై దాడులకు నిరసనగా ఆదివారం నందిగామలోని ఒకటవ వార్డు అనాసాగరం ఎస్సీ కాలనీలో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ఖండించారు. నందిగామ పట్టణ తెదేపా కౌన్సిలర్లు, తెదేపా నేతలతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపి ఆయన విగ్రహానికి మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య వినతిపత్రం అందజేశారు. కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్‌పై దాడి దుర్మార్గమన్నారు. **జగ్గయ్యపేట :** దళితులపై దాడి చేస్తూ అధికారపార్టీ రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయని టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం అన్నారు. పట్టణంలోని రఘురాం స్వగహంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రఘురాం మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన మొదలైన దగ్గర నుంచి దళితులు, బలహీన వర్గాలు, ఇతర మైనార్టీ వర్గాల మీద దాడులు నిత్యకత్యమైపోయాయన్నారు.

దీపావళి షాపులు తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : రాబోవు దీపావళి పండుగ సందర్భంగా నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాఘవాపురం గ్రామ శివారున ఉన్న నాగేంద్ర ఫైర్ వర్క్‌షాప్, చందాపురం గ్రామం శివారున ఉన్న వారహి ఫైర్‌వర్క్ షాపులను ఆదివారం నందిగామ ఎసిపి జనార్ధన్ నాయుడు, నందిగామ సిఐ హనీష్ తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. ఫైర్ వస్తే ఏంచెయ్యాలి అనే దాని మీద అవగాహన కల్పించారు. షాప్స్ పర్మిషన్, రికార్డ్స్ తగిన సూచనలు చేశారు. పలువురు పోలీసులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - గంపలగూడెం: ఎన్నికల హామీల భాగంగా సిఎం జగన్ ఎస్‌సిల్లో చేర్చుతామని ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నారని గంపలగూడెం మండలం తోటమూల గ్రామంలో గల బుడగజంగాలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.


దీక్షలో కూర్చున్న గ్రామస్తులు, నాయకులు

కోళ్లఫారం నిర్మాణం నిలిపేయాలని దీక్ష

తిరువూరు : వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదానగర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న స్నేహ ఫల్టీ కోళ్ల ఫారం నిర్మాణాన్ని నిలిపేయాలని గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు హాని కలిగించే కోళ్ల ఫారం నిలిపే వరకు ఈ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. గ్రామపంచాయతీ చేసిన 92వ తీర్మానాన్ని రద్దు చేయాలని, అధికారులు ప్రజాప్రతి నిధులు స్పందించేంతవరకు ఈ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు సిపిఎం మండల నాయకులు, ఆనందరావు వెంకటేశ్వరరావు వెంకటకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించినట్లు నందిగామ ఆర్డీవో పి.సాయిబాబా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు, వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలులోని చౌక ధరల దుకాణంలో శాశ్వత ప్రాతిపదికన డీలర్లను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. నందిగామ మండలంలో 5 షాపులు, చందర్లపాడులో 2, కంచికచర్లలో 6, వీరులపాడులో 5, జగ్గయ్యపేటలో 6, వత్సవాయిలో 2 పెనుగంచిప్రోలు మండలంలో రెండు షాపులకు దరఖాస్తులు కోరినట్లు తెలిపారు. అర్హులైన వారు నవంబర్ 12 సాయంత్రం 5 గంటలలోపు నందిగామ రెవెన్యూ డివిజన్ అధికారి వారికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్హత ఇంటర్మీడియట్, వయసు 18 నుండి 40 సంవత్సరాల లోపు వారు దరఖాస్తును స్వయంగా గానీ రిజిస్టర్ పోస్టులో గానీ రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయానికి పంపాలని సూచించారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు
సోమవారం 6 నవంబర్ 2023

ఉల్లి ధర మంట



ప్రజాశక్తి-గన్నవరం

ఉల్లిధరలు పెరిగిపోతున్నాయి. కొనేటట్టు లేదు..తినేటట్టు లేదు..ఉల్లి ధరలు ఇలా పెరుగుతూపోతే సామాన్యులం ఏం తినాలి. ఉల్లిపాయ లేనిదే కూరలు వంటడం కష్టం. ఇలా రేట్లు పెరుగుతూ పోతుంటే ఎవరూ పట్టించుకోవటం లేదు. అసలు ఉల్లి ధరలు పదే పదే ఎందుకు పెరుగుతున్నాయి. వీటిని కంట్రోల్ లో పెట్టలేరా? . ఇవీ.. మనకు తరుచుగా సాధారణ జనం నుంచి వినిపించే ప్రశ్నలు. నిజమే మరి.. ఉల్లి ధరలు ఎందుకు పెరుగుతున్నాయో.. అవి ఎప్పుడెప్పుడు తగ్గుతున్నాయో ఒక్కసారి పరిశీలిద్దాం.

గత రెండు వారాల క్రితం 25 రూపాయ లున్న కిలో ఉల్లి ధర అమాంతం పెరిగిపోయింది. కిలో ఉల్లి ధర రిటైల్ షాపులలో 70 రూపాయలకు చేరింది. ఇంకా పెరిగే అవకాశం కూడా ఉందంట. గతేడాది ఇదే సీజన్ లో కిలో ఉల్లి ధర రూ. 30 ఉంది.



వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బఫరింగ్ చేసిన ఉల్లిని రూ. 25లకే విక్రయించేందుకు ఉల్లి లే అవుట్లను తెరిచింది. అయితే ప్రస్తుతం ధరల నియంత్రణకు ఏంచేస్తోందని ప్రజల ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం దేశీయ మార్కెట్లో కూరగాయల లభ్యత పెంచడం, ధరలను అదుపు చేయడం లక్ష్యంగా 2024 డిసెంబర్ 31 వరకు ఉల్లి ఎగుమతులపై టన్నుకు 800 డాలర్ల కనీస ఎగుమతి ధర పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. అంతేకాకుండా ఉల్లి నిల్వలు పెంచేందుకు అదనంగా 2 లక్షల టన్నుల ఉల్లి సేకరణను కూడా ప్రభుత్వం ప్రకటిన చేసింది. ఇప్పటికే సేకరించిన 5 లక్షల టన్నులకు పైగా బెంగుళూరు గులాబీ ఉల్లి, కష్ణాపురం ఉల్లి పాయలు మినగా అన్ని రకాల ఉల్లికి మినిమం ఎక్స్‌పోర్ట్ ప్రైస్ ఉంది. ఇది సరసమైన ధరలకు వినియోగదారులకు తగినంత ఉల్లి అందుబాటులోకి రావాలంటే జనవరి వరకు ఆగాల్సిందేనని వ్యాపారులు చెబుతున్నారు. గన్నవరం మార్కెట్లో ఉల్లిపాయల దుకాణాలు 10 వరకు ఉన్నాయి. చిల్లర కోట్లు 30 ఉన్నాయి.వీటిలో రోజుకు 50 బస్తాల ఉల్లిపాయలు ఎక్కడ ఏం జరుగుతుందని వ్యాపారులు చెప్తున్నారు. తక్కువ రేట్ లో ఉన్నప్పుడు ఎక్కువగా ఉల్లిపాయలు ఉపయోగించే వారిని పెరిగిన రేట్ల తో కేజీ ఉల్లిపాయలు కొనడానికి కూడా ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ఇక హెూటల్ లో ఉల్లిపాయ అట్టు రేటు ఒక్కసారిగా పెంచేశారు. 30 రూపాయలు ఉండే అట్టును 50 రూపాయలు చేశారు.బిర్యానీ హెూటళ్లలో ఉల్లిపాయ ముక్కలు వేయడం మానేశారు.ఈ విధంగా ధరల ప్రభావం ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది ఇప్పటికైనా ప్రభుత్వం రంగంలోకి దిగి సబ్సిడీపై రైతుబజార్ల ద్వారా ఉల్లిపాయలు సరఫరా చేయాలని కోరుతున్నారు.



శిక్షణ పొందుతున్న రెడ్ వాలంటీర్లు

రెడ్ వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ బేరి యాత్ర బహిరంగ సభ, ర్యాలీలో ముందు పీటన మార్చి ఫాస్ట్‌లో నడిచేందుకు రెడ్ వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ శిబిరం ఆదివారం గన్నవరంలో జరిగింది. గన్నవరం, చనుపల్లె వారి గూడెం,ఉయ్యూరు, ఉంగుటూరు, పెనమలూరు గ్రామాల నుంచి యువకులు గన్నవరం వచ్చారు. వీరిలో మహిళా యువతులు కూడా ఉండడం విశేషం. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్, సమరం లు శిక్షణ ఇస్తున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి నరసింహారావు శిబిరాన్ని పరివేక్షిస్తున్నారు. 15వ తేదీన జరిగే ర్యాలీలో వీరు పాల్గొంటారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా వీరిని తయారు చేయడం జరుగుతుందని పవన్ తెలిపారు.

సిపిఎస్ రద్దు చేసే వరకు పోరాటం

- **మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు**

ప్రజాశక్తి-గన్నవరం : సిపియస్ రద్దు చేస్తామని, ఎప్పటికప్పుడు డిఎలు ప్రకటిస్తామని, మెరుగైన పిఆర్సి సమయానికి ఇస్తామని, ప్రత్యేక డియస్సి ఇస్తామని నమ్మబలికి గద్దెనెక్కిన ప్రభుత్వం హామీలను నీటి మూటలు చేసిందని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం గన్నవరంలో జరిగిన యుటిఎఫ్ గన్నవరం, ఉంగుటూరు మండలాల కౌన్సిల్ సమా వేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేట్ పరం చేసినా, పోలవరానికి నిధులు ఇవ్వక పోయినా, కడప ఉక్కు కర్మాగారం ఊసెత్తకపోయినా, ప్రత్యేక హెూదా ఇస్తామన్నవారు మాట తప్పినా మౌనముద్ర వేయడం శోచనీయం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెల జీతం ఎప్పుడు వస్తుందో అని ఉపాధ్యాయులు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోరాటం చేస్తేనే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుం దన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు మరీదు వరప్రసాద్, కర్ర వరప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.



యుటిఎఫ్ గన్నవరం మండల ప్రధాన కార్యదర్శిగా రాజబాబు

: యుటిఎఫ్ గన్నవరం మండల నూతన కార్యవర్గం ఎన్నికయింది. అధ్యక్షులుగా గొట్టం రవిబాబు, ప్రధాన కార్య దర్శిగా జి.రాజబాబు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా దాసరి నవభారతి, సహాధ్య క్షులుగా తాతా శ్రీనివాస్, నాగ సూర్యకుమారి, కోశాధికారిగా డి.శివప్రసాద్, కార్యదర్శులుగా సి.హెచ్.రత్నకుమారి, జె.కుమారి, ఎన్.సజశ్రీ, బి.జ్ఞానానందం, కె.ఉమాశంకర్, యం.వి.చలపతిరావ్, డి కుమార్, పి.బాల శౌరయ్య, కె.రంగారావు, ఆడిట ర్‌గా కె.నాగరాజు ఎన్నికయ్యారు.



నేడు ఉపాధి హామీ గ్రామసభలు


ప్రజాశక్తి-ఉంగుటూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం గ్రామసభలు సోమవారం వెన్నూతల, నాగవరప్పాడు, ఎలుకపాడు, వెల్దిపాడు గ్రామాలలో నిర్వహిస్తామని ఎంపీడీఓ శేషగిరిరావు చెప్పారు. ఈ సందర్భంగా జరిగే సభలకు ఆయా గ్రామ పంచాయితీ సర్పంచులు అధ్యక్షత వహిస్తారని, గ్రామంలో ఉన్న అర్హులైన గ్రామీణ ఉపాధి పథకం కార్మికులందరికీ పని కల్పించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించడం కోసం గ్రామ ప్రజల ఆమోదాన్ని తీసుకుంటామని అన్నారు.

అల్లరిమూకల ఆగడాలు

- విద్యార్థినులు, మహిళల్లో భయాందోళనలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో రోజు రోజుకీ ఆకతాయిల ఆగడాలు శ్రుతిమించి పోతున్నాయి. ప్రధానంగా హైస్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల వద్ద అల్లరి మూకల గ్యాంగ్ చేరుకుని విద్యార్థినీలతో పాటు అటు వైపు వెళుతున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో అటు మహిళలు, ఇటు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

చదువు మధ్యలోనే మానివేసి, పని పట్టా లేకుండా జులాయిగా తిరుగుతున్న యువకులు బైక్‌లపై తిరుగుతూ కళాశాల,పాఠశాలకు వెళ్లే విద్యార్థిని లతో విద్యా సంస్థల సమీపంలో తిరుగుతూ విద్యార్థినిలను ప్రేమించాలని వెంటపడుతూ యువతులను వేధింపులకు గురిచేస్తున్నారు. చదువుకునేందుకు పాఠశాల, కళాశాలలకు వెళ్లిన తమ పిల్లలు తిరిగి ఇంటికి వచ్చేవరకు తల్లిడంద్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ చేసే ఆకతాయిలపై పోలీసు నిఘా కొరవడిందని, అందువల్లనే వారు రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల నిఘా కొరడటంతో తప్పనిసరిగా తాము రోజూ వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలు, హైస్కూల్లో చదువుతున్న విద్యార్థినిలను అల్లరి మూక టార్గెట్ గా చేసుకుని తరచు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గుడివాడ రోడ్ జ్యోతి నగర్ కళాశాలలతో పాటు నూజివీడు రోడ్డు ప్రభుత్వ హైస్కూల్స్, ప్రైవేటు పాఠశాలలు,విజయవాడ రోడ్డు బస్టాండ్ వద్ద ఉదయం, సాయంత్రం పూట వచ్చి వెళ్లే విద్యార్థినీలు, యువతుల పట్ల ఈవ్ టీజింగ్ కు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తూన్నారు. అమ్మాయిల ఫోన్ నంబర్లు ఏదో ఒక రూపంలో తెలుసుకొని ఫోన్లు చేయడంతోపాటు ఫేసుబుక్, ఇంస్టాగ్రామ్ ధార మెసేజ్‌ల రూపంలో వేధిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటి వరకు పట్టణాలకే పరిమితం కాగా, పల్లెలకు సైతం ఈ సంస్కృతి పాకింది. వీటికి భయపడక కొందరు యువతులు తల్లిదండ్రులకు, స్నేహితులకు విషయాన్ని చెబుతున్నా, మరికొంత మంది గోప్యంగా ఉంచుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎవ్వరికీ చెప్పుకోలేక యువతులు మానసికంగా కుంగి పోతున్నారు. ఇకపోతే గ్రామీణా ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినీలు తరగతులు ముగిసిన తర్వాత తమ ఇళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు, ఆటోల కోసం బస్టాండ్ సవచ్చే సమయంలో ఈవ్ టీజర్లు మరింత రెచ్చిపోతూ నిక్ నేమ్లతో కామెంట్లు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. కొన్నిసార్లు చీకట్లో ఆకతాయిలు శతిమించి ప్రవర్తిస్తుండడం, వింత చేష్టలతో వేధిస్తుండడంతో విద్యార్థినీలు వణికిపోతున్నారు. ఈవ్‌టీజింగ్ కు పాల్పడుతున్న ఆకతాయిల అల్లర్లకు అడ్డుకట్ట వేయడంలో పోలీసుల నిఘా కొరవడిందని, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు, కళాశాలలు, హైస్కూల్ ప్రాంతాల వద్ద పోలీసుల నిఘా పెంచి అల్లరిమూకల ఆగడాలకు కళ్లెం వేయాలని విద్యార్థినీలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



ప్రజాశక్తి-పమిడిముక్కల : పట్టేలంక గ్రామాభివద్ధి కట్టుబడి ఉన్నానని గ్రామ సర్పంచ్ హిదయతుల్లా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలతో ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతు న్నారని అన్నారు. పామర్రు ఎంఎల్ఎ కైలా అనిల్ కుమార్ గడపగడప కార్యక్రమంలో ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. పట్టేలంక గ్రామంలో కరెంటు, తాగునీరు, రోడ్లు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.



మైత్రి ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని స్తానిక బలరాముని పేట ఏరియాలో నివసిస్తున్న రాజేష్ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత 10 రోజుల క్రితం పని చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు పడి కుడి చెయ్యి విరగడంతో వైద్యం చేయించుకున్నారు. ఈ పరిస్థితుల్లో మందులకు డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని స్థానికుల ద్వారా తెలుసుకున్న మైత్రీ ఫౌండేషన్ బందం ఆదివారం ఆ కుటుంబానికి 5 వేల చెక్ ద్వారా ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, రాధాకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

9న బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : మన్యం జిల్లా పార్వతీపురం సీతం పేటలో బయలుదేరిన సిపిఎం ప్రజారక్షణభేరి బస్సు యాత్ర 9వ తారీకు గురువారం కష్ణా జిల్లా ఉంగుటూరు మండలం చేరుతుందని, ఈ సందర్భంగా మండలంలోని సిపిఎం పార్టీ కార్యకర్తలు అభిమానులు ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మణస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం పెద్ద అవుటపల్లిలో జరిగిన సిపిఎం గ్రామసభలో లక్ష్మణస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్యేక హెూదా, పోలవరం నిర్మాణం, కడప ఉక్కు కర్మాగారం, రామాయపట్నం పోర్టు, రాజధాని, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీల విషయాలలో నోరు మెదపకుండా రాష్ట్రంలో ఉన్నటువంటి అధికార ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉంగుటూరు మండల పార్టీ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు రామరాజు సీతారామరాజు, సుబ్బారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ బ్యాంకు విశిష్ట సేవలు

ప్రజాశక్తి-గన్నవరం : ఒక్కరి కోసం అందరు... అందరి కోసం ప్రతి ఒక్కరు" అనే సహకార స్ఫూర్తితో నడుస్తున్న విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు సేవలు ప్రజలకు చేరువచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆ బ్యాంకు రాష్ట్ర డైరెక్టర్ సిహెచ్. కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సహకార బ్యాంకు సేవల్లో విశాఖ సహకార బ్యాంకు పాత్ర పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో 7026 కోట్ల టర్నోవర్, 50 బ్రాంచీలు, 96,000 వేల మంది సభ్యులు ఉన్నట్లు చెప్పారు. 325 కోట్ల షేర్ ధనం, దక్షిణ భారత దేశంలోనే 4 స్థానంలో ఉందన్నారు. 108 సంవత్సరాల చరిత్ర కలిగిన బ్యాంక్ దివిశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అన్నారు. వ్యాపారులకు, ఉద్యోగులకు ప్రత్యేకమైన రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ రేటు చెల్లిస్తున్నామని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకో వాలన్నారు. రిటైర్ అయిన వారికి కూడా రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : ఆంధ్ర లయోలా కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ ఆదివారం జరిగింది. సభకు దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు మూడు వేల మంది ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లు తరలివచ్చారు. ఈ మహాసభను ఉద్దేశించి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డివి.సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి శ్రీహరి రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది ప్రైవేట్ ఎలక్ట్రికల్స్ వర్కర్స్ ఉన్నారని తమ సంక్షేమాన్ని ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రతి మండలానికి ఒక సర్వీస్ సెంటర్‌ని ఏర్పాటు చేసి వారికి వత్తి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పనిముట్లకు రెండు లక్షల సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు చనిపోయిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల కుటుంబానికి 10 లక్షల రూపాయలు నష్టపరిహారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి అందజేసే



సంక్షేమ పథకాలు నాలుగు సంవత్సరాలుగా కార్మిక శాఖ నిలిపివేసిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ పథకాలు ఎలక్ట్రికల్ కార్మికులకు అందించాలని కోరారు. మహాసభలో అసోసియేషన్ కార్యదర్శి మాదన్న, ఉపాధ్యక్షులు కే. పాల్ రాజ్,కోశాధికారి ఎం శ్రీధర్ బాబు, కేరళ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమితి అసోసియేషన్ అధ్యక్షులు జార్జి మ్యాత్యు, తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు జడలు అంజయ్య, అసోసియేషన్ ప్రతినిధులు జేమ్స్ నక్క యాదగిరి, సోమ కొండల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో స్పందన

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు.

మొదటిపేజీ తరువాయి

విజయవాడ అభివృద్ధి శూన్యం

కూడా వన్‌టౌన్ అభివృద్ధి కాలేదన్నారు. పశ్చిమ నియోజకవర్గానికి శాశ్వత ఎంఎల్‌ఏగా వెలంపల్లి ఉంటారని తెలిపారు. గృహ నిర్మాణ వాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ విజయవాడ బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించారు కాబట్టే చంద్రబాబును ప్రజలు ఓడించారని చెప్పారు. జనసేన, టిడిపి కలిసి పోటీ చేసినా ఓడిపోయడం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు ఎవరూ ప్రవేశపెట్టలేదని చెప్పారు. ప్రతీ పేదవాడికి వైద్యం అందడానికి ఆరోగ్యశ్రీ, ప్రతీ రైతుకు నీరు అందేందుకు జలయజ్ఞం చేపట్టారన్నారు. సిఎం జగన్ మరో అడుగు ముందుకేసి సంక్షేమ పథకాలు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ధాన్యం కొనుగోళ్లు

కొనుగోలు చేస్తాం. ధాన్యం సేకరణకు ఎటువంటి లక్ష్యం లేదు. పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం.

ప్రశ్న:క్వింటా ధాన్యానికి మద్దతు ధర ఎంత? కొనుగోలుకు నాణ్యతా ప్రమాణాలు ఏమిటి?

సాధారణ రకము(కామన్) క్వింటాలు రూ. 2183, 75, గ్రేడ్ ఎ రకము రూ. 2203గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. విక్రయించే ధాన్యంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. తేమ 17 శాతం, వ్యర్థపదార్థాలు 1 శాతం, చెత్త, తాలు 1 శాతం, చెడిపోయిన రంగుమారిన, మొలకెత్తిన, పురుగుతిన్న గింజలు 5 శాతం, పరిపక్వము కాని గింజలు 3 శాతం లోపు ఉన్న కామన్‌రకంతోపాటు అదనంగా మరో ఆరుశాతం తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు (కేళీలు) ఉన్న ఏ గ్రేడ్ ధాన్యం సేకరిస్తాం. తమ ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలా రైతులు మెరుగుపరిచి ఆర్బీకెల్లో విక్రయించాలి.

ప్రశ్న: ధాన్యం అమ్మిన రైతులకు ఎన్ని రోజుల్లో నగదు జమవుతుంది? హమాలీ, రవాణా ఛార్జీలు రైతులకు చెల్లిస్తారా?

ఆర్బీకెల్లో విక్రయించిన ధాన్యానికి 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం. గోనె సంచులను, కల్లంలో ధాన్యాన్ని సంచుల్లో నింపడం, సంచులు కుట్టడం, , ఆ సంచులు వాహనాల్లో లోడ్ చేయడానికి అవసరమైన హమాలీలను ప్రభుత్వమే సమకూర్చుతుంది. రైతులు స్వయంగా గోనె సంచులు, హమాలీలను సమకూర్చుకుంటే లేబర్ చార్జీలను ధాన్యం నగదుతో పాటుగా ప్రభుత్వం రైతు ఖాతాలకు జమ చేస్తుంది. 40 కిలోల గోనె సంచికి రూ. 3.39, హమాలీ చార్జీలు క్వింటాకు రూ. 17.17లు చొప్పున ప్రభుత్వం అందిస్తుంది.

ప్రశ్న: ధాన్యం సేకరణకు గోనె సంచులు, రవాణా వాహనాలు అందుబాటులో ఉన్నాయా?

ఈ ఏడాది రైతులు వద్ద పండిన ధాన్యంలో స్థానిక అవసరాలకు పోను మిగిలిన మొత్తం సేకరిస్తాం. 1 కోటి 60 లక్షల గన్నీ బ్యాగులు అవసమవుతాయని అంచనా వేశాం. 50 లక్షల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచాం. ఇతర జిల్లాల నుంచి మరో 40 లక్షలు గన్నీలు సేకరిస్తున్నాం. ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా ఆర్బీకెల్లో అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకున్నాం. ధాన్యం రవాణాకు రెండు వేల వాహనాలు అవసరం. ముందస్తు హార్వెస్టింగ్ జరిగే ప్రాంతాల్లో నవంబర్ నెలలో 350 వెహికల్స్‌ను అందుబాటులో ఉంచాం. ధాన్యం రవాణా వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ అమర్చాలి.

ప్రశ్న: ఆర్బీకెలు, రైస్ మిల్లలను ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం చేశారా ?

జిల్లాలోని 318 ఆర్బీకెల ద్వారా ధాన్యం సేకరిస్తాం. ఒక్కో ఆర్బీకెలో ఒక టెక్నికల్ అసిస్టెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు సహాయకులను నియమించాం. 150 రైస్ మిల్లులున్నాయి. ధాన్యం సేకరణకు ముందే రైస్ మిల్లలను మండలాల వారీగా ఆర్బీకెలకు అనుసంధానిస్తూ మ్యాపింగ్ జరుగుతుంది. మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారేంటీ(బిజి)లు తీసుకుంటున్నాం.

ముగిసిన షార్ట్ ఫిల్మ్ మేకింగ్ శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్



వాసవ్య మహిళా మండలి మరియు ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐడిపిఎ) సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణా శిబిరం స్థానిక వాసవ్య మహిళా మండలిలో ముగిసింది. ఈ సందర్భంగా వాసవ్య మహిళా మండలి అధ్యక్ష్యులు డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతులుగా చేయడానికి బాతిక్ పెయింటింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరి, బ్యూటీషియన్, కుట్టుమిషన్ల మెకానిక్ వివిధ కార్యక్రమాలను వాసవ్య రూపొందిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు కషిచేస్తుందని అందులో బాగంగా ఐడిపిఎ తో కలిసి ఈ ఐదు రోజుల శిక్షణా శిబిరాన్ని నిర్వహించామని ఆమె అన్నారు. ఈ శిక్షణలో డాక్యుమెంటరి మరియు షార్ట్ ఫిల్మ్ పై శిక్షణ తరగతులు జరిగాయని ఆమె అన్నారు. ఇందులో తర్ఫీదు పొందిన వారు ఆర్థికంగా ఎదుగుతూ ఇతరులకు కూడా ఉపాది కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఐడిపిఎ కోశాధికారి రవీంద్ర కాత్యాయన్ మాట్లాడుతూ వారంలో రొండు రోజులు షఊటింగ్ లు తీస్తూ మిగిలిన రోజులలో ఎడిటింగ్, టెక్నిక్స్ తదితర వాటిపై దష్టి సారించాలని అభ్యర్థులకు తెలిపారు. డాక్యుమెంటరి మరియు షార్ట్ ఫిల్మ్ ఎంపిక చేసేటప్పుడు మన చుట్టు ఉన్న అంశాలను, సమస్యలను దానికి పరిష్కార మార్గాలను తెలుపుతూ తీయాలని ఆయన అన్నారు. ముంబైలో 2024 మే నెలలో ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఐడిపిఎ ఉపాధ్యక్షులు సురేష్ శర్మ మాట్లాడుతూ ఈ ఐదు రోజులలో నేర్చుకున్న అంశాలతో శాంపిల్ డాక్యుమెంటరి తీసి ప్రదర్శించిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లను అందజేశారు.

ఓటరుగా నమోదు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: 2024 జనవరి ఒకటో తేది నాటికి 18 సంవత్సరములు నిండే ప్రతి ఒక్కరూ ఈ ఏడాది డిసెంబర్ 9 వ తేదీ లోపు ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, డిసెంబర్ 2, 3 తేదీల్లో మరలా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ ఎస్ డిల్లీ రావు తెలిపారు. జిల్లాలో 2024 జనవరి ఒకటో తేది నాటికి 18 సంవత్సరములు నిండిన లేదా నిండుతున్నట్లయితే వారు 2023 డిసెంబర్ 9 తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకొనవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఇందు కోసం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులైన వారు ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ ప్రత్యేక ఓటరు నమోదు రోజులలో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల నందు అందుబాటులో ఉండి ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.దరఖాస్తు విధానం సీఓటర్ హెల్ప్ ఆన్ లైన్ ద్వారా మొబైల్ అప్లికేషన్ నేషనల్ ఓటర్స్ సర్వీసు ద్వారా ఫారం లు సమర్పించవచ్చునన్నారు. ఎన్నికలకు సంబందించిన మరింత సమాచారం మరియు సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1950 (జిల్లా ఎన్నికల అధికారి వారి కార్యాలయాన్ని) సంప్రదించ వచ్చునని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. తుది ఓటర్ల జాబితా 2024 జనవరి 5 న ప్రకటించబడుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు ఆప్రకటనలో తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణ పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం వాంబే కాలనీ, హెచ్ బ్లాక్ కమ్యూనిటీ హాల్లో



ఉన్న 58, 59 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రత్యేక సంక్షిప్త కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న బిఎల్ఓతో మాట్లాడుతూ డబుల్ ఎంట్రీస్ లేకుండా చూసుకోవాలని, మరణించిన ఓటర్లని తొలగించాలని, ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలని ఆదేశాలిచ్చారు. కొత్త ఒటర్లు ఎంత మంది నమోదు చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండ్రోజులు మంచినీటి సరఫరా నిలుపుదల

స్థానిక అరండల్‌పేట దాసు వారి వీధిలో ఉన్న 600 ఎంఎం డయా నీటి సరఫరా ప్రధాన పంపింగ్ మెయిల్ లైన్ రిపేరు వర్క్ చేస్తున్నందున ఆరండల్‌పేటలోని సీతారామ్‌పురం, దుర్గ అగ్రహారం, ఏలూరు రోడ్డు, సూర్యారావుపేట కొంత బాగం, గవర్నర్‌పేట తదితర ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి మంగళవారం సాయంత్రం నీటి సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయండి

పెనమలూరు : ఈనెల 15వ తారీకు విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ ని జయప్రదం చేయాలని కష్ణాజిల్లా సిపిఎం పార్టీ కార్యవర్గసభ్యులు ఆరఘు అన్నారు. సభను జయప్రదం చేయాలని కోరుతూ తాడిగడప మున్సిపాలిటీ సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసంఘాల బాధ్యులతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్. రఘు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, యు త్రిమూర్తులు, పుసులూరి పాతాళ లక్ష్మి, ఎస్కే మస్తాన్వలి, పి. లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాసరావు, అమరయ్య శాస్త్రి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15 వ తేదీన విజయవాడ లో జరుగ నున్న ప్రజా రక్షణ బేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో సిపిఎం నాయకులు వాక రామచంద్ర రావు ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేడంకి వెంకటేశ్వరావు, గోరుముచ్చు వెంకటేశ్వరావు, బలే చింతయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన, విభజన హామీలకు ఎసరు పెట్టిన కేంద్ర ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ రంగాన్ని తెగ నమ్ముతూ, ప్రజల ఆస్తిని అంబానీ అదానిలకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఎం పార్టీ మచిలీపట్నం నగర కార్యదర్శిబూర. సుబ్రహ్మణ్యం ప్రజలకు తెలిపారు. ప్రజారక్షణ బేరి యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్లోని రాజుపేట మగ్గాల కాలనీ సిపిఎం పార్టీ మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ధనుంజరావ్, కే శర్మ, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, సిహెచ్ జయ రావు, టి చంద్రపాల్, ప్రజాతంత్ర మహిళా సంఘం మచిలీపట్నం అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్ విజయలక్ష్మి,కే సుజాత, పులగం వేణు, ప్రజానాట్య మండలి నాయకులు ఈ నాగయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్. రఘు


మచిలీపట్నంలో..


ఘంటసాలలో..

9న పామర్రులో బస్సుయాత్ర : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పమిడిముక్కల : పామర్రులో ఈ నెల 9వ తేదీన సాధికార బస్సు యాత్ర ఉంటుందని యాత్రలో అందరూ పాల్గొనాలని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తాడంకి గ్రామంలో జడ్పిటిసి ఏనుగ వెంకటరమణ కుమారి ఇంటి వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. సాధికార బస్సు యాత్రలో మంత్రులు జోగి రమేష్, ఆదిములపు సురేష్, మెరుగు నాగార్జున, విడుదల రజిని, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు మస్తాన్రావు, సొంటి వెంకటేశ్వరరావు, కాసాని శ్రీనివాసరావు, కూచిపూడి వెంకటేశ్వరరావు, కంబపు రాంబాబు, కొడమంచిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కైలే


సహాయం అందజేస్తున్న శ్యామ్ కిషోర్నాయుడు

నిర్మల సంస్థలు 75 వసంతాలు పూర్తిచేసుకోవడం అభినందనీయం

ప్రజాశక్తి-గుడివాడ : ప్రపంచదేశాలలలో ఎంతో మందికి విద్యను వైద్యాన్ని అందజేస్తున్న నిర్మల మఠకన్యల సంస్థలు 75సంవత్సరాల క్రితం గుడివాడలో ప్రారంభం అవడం గొప్ప విషయమని నిర్మల సంస్థల మదర్ జనరల్ రెవరెండ్ సిస్టర్ ఆంటోనీలా, అసిస్టెంట్ మదర్ రెవరెండ్ సిస్టర్ జనరల్ బ్రిడ్జిట్లు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల (ఆర్సిఎం) చర్చిలో నిర్మల సంస్థలు ఏర్పాడి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా నిర్మల సంస్థలు పరిశీలించేందుకు వచ్చిన మదర్ జనర్లో సిస్టర్ ఆంటోనీలా, అసిస్టెంట్ మదర్ జనరల్ సిస్టర్ బ్రిడ్జిట్లను కార్మెల్ మతా దేవలయం విచారణగురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహయగురువు జాన్హరిష్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిస్టర్ మదర్ జనరల్ ఆంటోనీలా మాట్లాడుతూ 75సం॥ క్రితం నిర్మల సంస్థలను అనాటి సిస్టర్లు గుడివాడలో బాలికల స్కూల్ను, అమెరికన్ హస్పటల్ స్థాపించడం జరిగిందన్నారు. నేడు నిర్మల సంస్థలు దేశవ్యాప్తాంగా సిస్టర్లు పర్యవేక్షనలో విద్యా సంస్థలు, వైద్యశాలలు కోట్లమందికి సేవలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సంస్థల మదర్ సిస్టర్ బ్రల్ట్, సూపిరియ సిస్టర్ శిరిష, సిస్టర్లు విజయశాంతి, జయమ్మ, కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియంజోషి పాల్గొన్నారు.

దళితులపై దాడికి టిడిపి నిరసన


గుడివాడలో...


గన్నవరంలో...

ప్రజాశక్తి-గుడివాడ : దళిత వర్గాలనకు తీవ్ర అన్యాయం చేసిని జగన్మెహనరెడ్డి దళిత ద్రోహి అని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక కొతిబోమ్మ సెంటర్లోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు అధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగన్మెహనరెడ్డి మీ బిడ్డను నేను చెప్పుకుంటు 4 సంవత్సరాలుగా దళితులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కంచికచర్లలో దళిత యువకుడు శ్యామ్పై దాడి చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకులేదన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, మహిళ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు కంచర్ల సుధాకర్, మద్దాల ఇస్సాక్, దాసు శ్యాంప్రసాద్ ఆకునూరి కనకాంబరం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ దళితులకు మేనమామ అని చెప్పుకుంటున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళలు అగైత్యాలు దాడులు చేస్తున్నా సరే నోరు మెడపలేకపోవడం దారుణమని అన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా వైసీపీ పార్టీలో ఉన్న దళిత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు స్పందించక పోవడం దళితులను మోసగించడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడిపల్లి రమాదేవి పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండల పరిధిలోని గుల్లలమోద గ్రామానికి చెందిన చింత ఆదిశేష రావు పక్షవాతం సోకి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు పాఠశాల నాయుడు రూ 7వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఆదిశేష రావు గహానికి వెళ్లి ఆయన పరామర్శించి బాధితుని ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధితుని భార్య చింతా కోటేశ్వరమ్మ తో పాటు గ్రామస్తులు శ్యామ్ కిషోర్ కు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ చింతా పాపారావు, చింతా సుబ్బారావు, వల్లభనేని నాగమల్లేశ్వరరావు, వల్లభుని వెంకటేశ్వరరావు, మోకా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేలు అందజేత

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు నక్క గాంధీ అన్నారు. బాపులపాడు మండలం పలు గ్రామాలలో మృతిచెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు. హనుమాన్ జంక్షన్ ఇందిరానగర్ కు చెందిన ఆశా వర్కర్ కాలి నిర్మల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న గన్నవరం నియోజవర్గ ఎమ్మెల్యే వంశీ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించమని స్థానిక నాయకులకు తెలిపారు. ఆదివారం మతురాలి కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి నక్కా గాంధీ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఎమ్మెల్యే వంశీ పంపించిన 25,000 వేల ఆర్థిక సాయంని కుటుంబ సభ్యులకు అందజేశారు. కాకులపాడు గ్రామానికి చెందిన సదర్ల ఫాతిమా గుండెపోటుతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ ఎర్రగుళ్ల నగేష్, మండల జడ్పిటిసి సభ్యులు కొమరవెల్లి గంగాభవాని, బాపులపాడు గ్రామ సర్పంచ్ సరిపల్లి కమలకిరణ్ కాకులపాడు గ్రామ సర్పంచ్ కజా ప్రసాద్, ఎంపీటీసీ కోటయ్య పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నక్క గాంధీ, ఎంపీపీ ఎర్రగొల్ల నగేష్ తదితరులు

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

.ప్రజాశక్తి-పెదపారుపూడి : ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తాసిల్దార్ వి నాగభూషణం అన్నారు. ఆదివారం స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో పోలింగ్ బూత్ లు పరిశీలించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కొత్త ఓటుకు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి. రవికుమార్ , బిఎల్వోలు చాట్ల అజయ్ కుమార్, రాధా కుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** కొత్త ఓట్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని శని, ఆదివారం నిర్వహించినట్లు మండల తాసిల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తానా తెలిపారు. మండలంలోని ప్రతి నమోదు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లు నమోదు కోసం 57 పోలింగ్ స్టేషన్ వద్ద నమోదు కేంద్రాల ను ఏర్పాటు చేశామని అన్నారు. అర్హత ఉన్నవారు ఫామ్ 6 -48, ఫామ్ 7-17 ఫార్మ్ 8-37 నమోదు చేసకోవాలన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 9వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు

ఓట్ల అవకతవకల్లో లోపాలు సరిచేయాలి : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇంటింటా సర్వే అనంతరం కూడా ఒకే డోర్ నెంబర్ తో 90 ఓట్లు ఉండటం దేనికి సంకేతం అని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రాం ఎలక్ట్రోలార్ రిజిస్ట్రేషన్ అధికారిని వి పార్వతి దష్టికి తీసుకువచ్చారు. అవనిగడ్డ 144 నెంబర్ పోలింగ్ బూత్ వద్ద నమోదు కేంద్రాన్ని టిడిపి నాయకులతో కలిసి వెంకట్ రామ్ సందర్శించారు. ఇంటింటా ఓట్లు వెరిఫికేషన్ తర్వాత కూడా ఇటువంటి సంఘటనలు వెలుగు చూడటం పట్ల అధికారుల అలసత్వాన్ని విమర్శించారు. ఈ బూత్ పరిధిలో పదిమంది కొత్త ఓటర్లకు దరఖాస్తు చేస్తే కేవలం ఒక్క ఓటు మాత్రమే నమోదు అయినట్లు పార్వతికి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు పార్టీకి నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై ప్రత్యేక రివిజన్ కార్యక్రమం బాపులపాడు మండలంలో ఆదివారం వివిధ గ్రామాల్లో నిర్వహించారు. రంగన్నగూడెంలో నిర్వహిం చిన ఓటర్ల జాబితా ముసాయిదా పరిశీలనలో ఆళ్ల గోపాలకష్ణ, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. రంగన్నగూడెం గ్రామానికి సంబంధించి 2401ఓటర్ల ఉండగా 2380 మంది ఓటర్లను మాత్రమే జాబితాలో ప్రచురించారని, 27 మంది మతుల ఓట్లు తొలగించకపోగా, అర్హులై ఫారం6ద్వారా దరఖాస్తు చేసుకున్న 41 మందీని నూతన జాబితాలో ప్రచురించలేదన్నారు. దీనిపై బీఎల్ ఓలను ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలవల్ల ప్రచురించలేదని చెపుతున్నారని, కానీ టీడీపీ సానుభూతిపరుల ఓట్లు చేర్చకుండా కావాలని తాత్సార్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరవల్లిలో మరణించిన వారి పేర్లు తొలగించకుండా కొత్త ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిపేర్లు కొన్ని మాత్రమే జాబితాలో ప్రచురితమవడంతో యువకులు మళ్లీ దరఖాస్తులు అందజేశారు. ఓటర్ల జాబితా మొత్తం తప్పులతడకగానే ఉందంటూ తెలుగురైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్రలు బీఎల్ఎలపై అసహనం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న గుడ్లవల్లేరు తహసీల్దార్


అవనిగడ్డలో ఓట్ల అవతకవలపై అధికారులను ప్రశ్నిస్తున్న మండలి వెంకట్రాం


జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కామినేనిలో విజయవంతంగా ఆర్థోస్కోపీ సిఎంఇ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : మోకాలు, భుజం సంబంధించి కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థోస్కోపీ సీఎంఈ విజయవంతంగా జరిగింది. నగరంలోని నోవోటెల్ హోటల్లో ఆదివారం జరిగిన ఈ కార్యశాలలో అధునాతన ఆవిష్కరణలపై విస్తతంగా చర్చించారు. విజయవాడ ఆర్థోపెడిక్ సొసైటీ (వీవోఎస్), ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (వోఎస్ఎస్ఏపీ)ల సహకారంతో ఈ వర్క్ షాప్ ఆద్యంతం విజ్ఞానదాయకంగా సాగింది. కోర్స్ డైరక్టర్ డాక్టర్ బెజవాడ పాపారావు, సెక్రటరీ డాక్టర్ వై. సాయి ప్రమోద్, వీవోఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.జె. నాయుడు, సెక్రటరీ డాక్టర్ కె. వాసు, వోఎస్ఎస్ఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ నారాయణరావు, సెక్రటరీ డాక్టర్ పి. నరేష్ బాబు తదితర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాపును ప్రారంభించారు. ఫ్రైజ్ సెషన్స్ తో పాటు పలు అంశాలపై నిపుణులు వీడియో ప్రజంటేషన్ చేశారు. ఈ సీఎంఈకి సిరోనిక్స్ స్పాన్సర్‌గా వ్యవహరించగా, దేశంలోని వివిధ వైద్య విజ్ఞాన సంస్థల్లో సేవలందిస్తున్న దిగ్గజ వైద్య నిపుణులు ఈ వర్క్ షాప్ లో పాల్గొని, పలు అంశాలపై ప్రసంగించారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకుందాం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ఇబ్రహీంపట్నంలో అక్కినేని కృష్ణ సుందరరావు వేదికపై జరిగాయి. ఈ కార్యక్రమ ప్రారంభంలో జాతీయ జెండా ఆవిష్కరణ మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ఎస్‌టిఎఫ్ఐ జెండాను యుటిఎఫ్ సీనియర్ నాయకులు వై.నాగభూషణం, యుటిఎఫ్ పతాక ఆవిష్కరణను పి.వెంకటేశ్వర రెడ్డి చేశారు. ఈ సమావేశ ప్రారంభ ఆహ్వానం యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి రెడ్‌స్టార్, ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శి కేజే ఆన్ స్ట్రాంగ్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వత్తి ధర్మంతో పాటుగా సమాజం పట్ల దేశం పట్ల బాధ్యతతో నడుచుకోవాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆ బాధ్యత యూటీఎఫ్ కార్యకర్తలు గా ఉన్న మనం ముందుండే నిర్వహించాలని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ఆదేశాల అనుగుణంగా ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అంతేతప్ప ప్రజా సంక్షేమాలను పట్టించుకోవటం లేదన్నారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్టీఆర్ జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శిగా ఆలవాల సుందరయ్య, గౌరవాధ్యక్షులుగా మచ్చా శ్రీనివాస్, అధ్యక్షులుగా కుక్కడపు శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.కష్ణయ్య, ఉపాధ్యక్షురాలుగా డి.అపర్ణ, కార్యదర్శులుగా కె.గంగరాజు, డి సిహెచ్.సూర్యనారాయణ, డి హరి ప్రసాద్, బి రెడ్ స్టార్, పి.భవాని, షేక్ హుస్సేన్ సాహెబ్, బి.రమణయ్య, జె.సుధానంద్, ఏ అనంత కుమార్ ఎన్నిక కాబడ్డారు.



మాట్లాడుతున్న బొడ్డు నాగేశ్వరరావు

హోరాహోరీగా

- ఆలిండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు





ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలలో మెయిన్ డ్రా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం నగరంలోని మూడు చోట్ల దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం, పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమిలో పోటీలు నువ్వా నేనా అన్నట్లు జరుగుతున్నాయి. పోటీలు అండర్ -15, అండర్ -17 బాల బాలికల విభాగంలో జరుగుతున్నాయి. ఈసదర్భంగా తొలి రౌండ్ విజేతల వివరాలను నిర్వాహకులు తెలియచేశారు.

అండర్ -15 .. సింగిల్స్ బాలుర విభాగంలో ప్రతీక్ కౌండిల్య (కర్ణాటక) 21-8, 21-12 పాయింట్లతో ఆయుష్ ఆదే (మహారాష్ట్ర)పై, తనీష్ చోక్షి (గుర‌జాత్) 21-15, 21-15 పాయింట్లతో కవయుగన్ (తమిళనాడు)పై, మార్టిన్ ఇంగుడమ్ (మణిపూర్) 21-10, 21-12 పాయింట్లతో మంకుతాకుపై, విజయం సాధించారు. అవధూత్ కదమ్ (మహారాష్ట్ర) 21-10, 21-14 పాయింట్లతో కందర్ప్ శర్మ (రాజస్తాన్)పై, కిరణ్ నాగుంచి (కేరళ) 21-18, 17-21, 21-16 పాయింట్లతో ఆదవ్ స్యూ (తమిళనాడు)పై విజయం సాధించారు. బాలికల సింగిల్స్‌లో ఎస్.ఆర్. దిశా (తమిళనాడు) 21-12, 23-21 పాయింట్లతో బాల మన్వితారెడ్డి అల్లం (తెలంగాణ)పై, మోహిత పోలవరం (తమిళనాడు) 21-19, 19-21, 21-17 పాయింట్లతో ఐక్య శెట్టి (కర్ణాటక)పై, రిషిక నంది (ఢిల్లీ) 21-4, 21-6 పాయింట్లతో ప్రజక్త గౌక్వాడ్ (మహారాష్ట్ర)పై విజయం సాధించారు. స్నేహ మౌర్య (ఢిల్లీ) 21-17, 21-13 పాయింట్లతో ధాన్య సంజన పై విజయం సాధించారు. **మిక్స్‌డ్ డబుల్స్ :** చరణ్ రామ్ తిప్పన - జస్విత దంగటిల జోడి 21-6, 21-11 పాయింట్లతో శరత్ పండిట్ - రితిక కుంబ్లేపై విజయం సాధించారు. బేతన్ రౌత్ (ఒరిస్సా) శ్రేయ త్రిపాఠి (ఢిల్లీ) జోడి 21-7, 21-12 పాయింట్లతో శ్రీయాన్స్ క్రేజివాల్, జెస్సికా శేషుపై విజయం సాధించారు. **మిక్స్‌డ్ డబుల్స్ :** అండర్ -17 విభాగంలో శౌర్య కిరణ్ - కీర్తి మంచల (తెలంగాణ) 21-5, 21-10వన్ష బత్ర - సీజా (పంజాబ్)పై, విష్ణు కేదార్ కోడే - ఎస్.కౌర్ లజోడి 21-15, 21-16 పాయింట్లతో లక్ష్య ముగ్ధల్ -మెహక్ పూనియాపై విజయం సాధించారు.

విజయవాడలో రేపటి నుండి అండర్-19 బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ అండర్ -19 అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నగరంలోని పిబి సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సి.ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు. మొగల్‌రాజపురంలోని పిబి సిద్ధార్థ జూనియర్ కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో టోర్నమెంట్ వివరాలను తెలియచేసేందుకు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు 8,9 తేదీలలో పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు గానూ 13 జిల్లాల నుండి 130 మంది బాల, బాలికల విభాగంలో క్రీడాకారులు పాల్గొంటారన్నారు. బాలుర విభాగంలో ఒక్కొక్క జిల్లా నుండి ఐదుగురు క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

26 మంది నిర్వహణా సభ్యులు పాల్గొంటారని తెలిపారు. టోర్నమెంట్ చీఫ్ కోచ్ భాస్కరరావు నిర్వహణలో పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనపరచిన వారిని స్కూల్ గేమ్స్ జాతీయ జట్టుకు ఎంపికచేస్తామన్నారు. జాతీయ స్థాయి పోటీలు డిసెంబరు 12వ తేదీ నుండి నగరంలోనే జరుగనున్నాయని తెలిపారు. పిబి సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిద్ధార్థ కళాశాల క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్కూల్ గేమ్స్ నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చి అన్ని ఏర్పాట్లు చేస్తున్న ట్లు తెలిపారు. టోర్నమెంట్ డైరెక్టర్ వేమూరి రవికాంత మాట్లా డుతూ పోటీలను నిర్వహించే చెన్నుపాటి ఇండోర్ స్టేడియంలో ఆరు కోర్టుల ద్వారా పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.


మాట్లాడుతున్న సిఎస్ఎన్ రెడ్డి

క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్రీడల్లో రాణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాలను కల్పిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకా నాథ్ అన్నారు. యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ రాంకింగ్ బ్యాడ్మింటన్ మెయిన్ డ్రా పోటీలను ఆదివారం ఉదయం నగరంలోని దండమూడి రాజ గోపాలరావు ఇండోర్ స్టేడియంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ.పి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అండర్ -15, అండర్ - 17 బాల, బాలికల విభాగంలో క్వాలిఫైడ్ రౌండ్ పోటీలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. నగరంలో దండమూడి రాజగోపాల్ రావు ఇండోర్ స్టేడియం, పటమట చెన్నుపాట్ రామ కోటయ్య ఇండోర్ స్టేడియంలో, సాయిసందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతున్నాయని తెలిపారు. పోటీలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలనుండి 2200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. బ్యాడ్మింటన్ పట్ల క్రీడా కారులు ఆసక్తి చూపుతున్నారని, తల్లిదండ్రులు కూడా సహకరిస్తున్నారని అన్నారు. పోటీలు ఈ నెల 8వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. విజేతలకు 10 లక్షలు నగదు బహుమతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫా మెరైన్ మేనేజింగ్ డైరెక్టర్ దూడల సుధాకర్, లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడెమీ ఛైర్మన్ అద్దంకి మురళి కష్ణ, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ వై.సత్య నారాయణ ప్రసాద్, బిఎస్ఎన్ఎల్ఎపి సీనియర్ జనరల్ మేనేజర్ కె.వి.సత్య ప్రసాద్, ప్రముఖ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ వరుణ్ గుంటూరు, సాయి సందీప్ అకాడెమీ ఛైర్మన్ కె.భాస్కర్‌రావు, కష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పరసా శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కె.బాలసుబ్రమణ్యం, ఎన్.వెంకట్, రిఫరీ మిలింద్ దేశ్ ముఖ్ పలువురు ప్రముఖులు, క్రీడాకారులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ద్వారకా నాథ్


నివాళులర్పిస్తున్న దృశ్యం

రంగారావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యుటిఎఫ్ కష్ణా జిల్లా తొలి తరం నాయకులు, ఉత్తమ ఉపాధ్యాయులు పిన్నమనేని రంగారావు మృతి తీరని లోటని యుటిఎఫ్ జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమంలో, ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. యుటిఎఫ్ సంస్థను బలోపేతం చేయడానికి అనేక సంవత్సరాలు కషి చేశారన్నారు. ఈ సందర్భంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు సంతాపాన్ని తెలిపారు.

మసీదు పరిశీలన

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో జుజ్జూరు మండల కేంద్రంలో ప్రముఖ విజయనగరం తాజుద్దీన్ బాబా ఆస్థాన పండితులు మొహమ్మద్ జాఫర్ షరీఫ్ జుజ్జూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన మసీదులో పరిశీలించారు. అనంతరం గ్రామంలో సిపిఎం నాయకులు లాల్ అహ్మద్ గౌస్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యకర్తలతో గ్రామ ప్రజలతో మాట్లాడుతూ దేశంలో సిపిఎం క్రమశిక్షణ గల సిపిఎం పోరాటం నికరంగా ప్రజల పక్షాన పని చేస్తుందని అన్నారు. జాఫర్ షరీఫ్ సిపిఎం నాయకులు సుందరయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్ర మంలో ముస్లిం మైనార్టీ ప్రజలు పాల్గొన్నారు చిన్న మీరా హుస్సేన్ షేక్ కాజా తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - వత్సవాయి : విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ప్రైవేటీకరణ చేయవద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాము పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సంఘాలు 8న బందుకు పిలుపునిచ్చాయని, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక కూలి పనులకు వెళు న్నారని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని విద్యార్థులంతా ఐక్యంగా కాపాడుకోవాలని అన్నారు.

నకిలీ పోలీసులు అరెస్టు

ప్రజాశక్తి - మైలవరం : పోలీసులమని చెప్పి ఒక వృద్ధుడిని బెదిరించి కొట్టిన ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు జి.కొండూరు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు. చిన్న నందిగామకు చెందిన కోట ఇమ్మానుయేల్ అనే వృద్ధుడు ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం పోగు చేసి నూకలుగా మార్చి అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటారు. తోలుకోడు గ్రామానికి చెందిన కొవ్వలి రాజు అలియాస్ రాజీవ్ రాజు, (పల్నాటి ప్రభ) మైలవరానికి చెందిన ఎర్రగోపుల రాంబాబులు కోట ఇమ్మానియేల్ వద్ద ఉన్న నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని జి కొండూరు పోలీసులమని చెప్పి బెదిరించి, కొట్టి లాక్కున్నారు. ఈ క్రమంలో ఆ బియ్యాన్ని వెల్వడం గ్రామంలోని ఒక రైస్ మిల్లు ఓనర్‌కు అమ్మారు. ఇమ్మానుయేల్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ఇద్దరిని అరెస్టు చేసి మైలవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై ధర్మరాజు తెలిపారు.